క్లుప్తంగా

తూర్పు కాపుల ఐక్యతకు కృషి



సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు ప్రతినిధులు

టెక్కలి రూరల్: తూర్పుకాపుల ఐక్యతకు కృషి చేయాలని, నియోజకవర్గంలోని తూర్పుకాపులు అందరూ ఒకేతాటిపై నడవాలని ప్రముఖ వైద్యాధికారి ఆర్.చిన్నంనాయుడు అన్నారు. టెక్కలిలో నియోజకవర్గ స్థాయి తూర్పు కాపుల సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా జనవరి 5వ తేదీన బన్నువాడ రోడ్డులో జరగనున్న నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురించి చర్చించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మోదుగవలస గణపతిరావు, తమిరి బలరాం, లావణ్య, పోలాకి చంద్రశేఖర్, ఎం.శాంతారావు, పి.షణ్ముఖరావు, జగన్ పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చకు సిద్ధమవ్వాలి



సూచనలిస్తున్న ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథంలు

ఇచ్ఛాపురం రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు నిర్వహించనున్న 'పరీక్ష పే చర్చా-25'కు ఉపాధ్యాయులు సిద్ధమవ్వాలని ఎంఈవోలు కె.అప్పారావు, విశ్వనాథంలు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్‌తో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 6 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. లాగిన్‌లో నమోదు చేయు విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయులతో పాటు డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహణ చేపట్టనున్నట్లు హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. గురువారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగంగా ఎంఈవోలు ధనుంజయ మజ్జి, కె.చిట్టిబాబులు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: స్థానిక శివాజీనగర్‌లోని శిరిడీ సాయిబాబా మందిరంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వైద్యురాలు మంజుల నటరాజ్ చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన భక్తులకు క్యాలెండర్లు అందజేశారు. అలాగే దేవాలయ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) చేతులమీదుగా భక్తులందరికీ స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు మల్లా కామేశ్వరరావు, తాళాసు ప్రదీప్, బెల్లాల నారాయణరావు, డబ్బీరు బౌనేశ్వరరావు, బోనెల రమణ, కూన హేమాచలం, డాక్టర్ కృష్ణ, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఏడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి మణికంఠను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కంచిలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.మణికంఠ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ త్రోబాల్ పోటీల్లో ఆడేందుకు అర్హత పొందాడు. సెప్టెంబర్ నెలలో వివిధ స్థాయిల్లో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థి చక్కని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయిలో అండర్-17 విభాగంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నాడు. దీంతో ఈ విద్యార్థిని పాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీతారాంనాయుడు అభినందించారు. ఆయనతో పాటు పీడీ ఎం.రోజారమణి, ఉపాధ్యాయుడు కిషోర్ ఖడంగాలు ఉన్నారు.

30న గ్రిగ్స్ పోటీలు

వజ్రపుకొత్తూరు: ఈనెల 30న మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం కె.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరవ్వాలని కోరారు. 31వ తేదీ వరకు రెండు రోజులు పాటు ఈ క్రీడలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు.

పాఠశాలలకు వరం పీఎంశ్రీ

- ఐదేళ్లపాటు బడులకు ఊతం
- టెక్కలిలో నాలుగు హైస్కూళ్ల ఎంపిక
- గత ప్రభుత్వంలో నాడు-నేడుతో అభివృద్ధి



సంతబొమ్మాళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

సంతబొమ్మాళి: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫండ్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఈ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో గత రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

టెక్కలి నియోజకవర్గంలో...

పీఎంశ్రీ పథకం అమలుకు నిర్దేశించిన 46 అంశాల ఆధారంగా టెక్కలి నియోజకవర్గంలో నాలుగు పాఠశాలలను గుర్తించి గతేడాది నవంబర్‌లో విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతంలోని పాఠశాలలు 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీ పథకం లబ్ధి కోసం ఎంపిక చేస్తారు. సంతబొమ్మాళి మండలంలోని సంతబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టెక్కలి మండలంలోని టెక్కలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కోటబొమ్మాళి మండలంలోని కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందిగామ మండలంలోని నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఈ పథకానికి ఎంపికయ్యాయి.

మౌలిక వసతులు పెంపు

ఈ పథకం కింద పాఠశాలల్లో విద్యాబోధన సదుపాయాల్లో నాణ్యతా ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చనున్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, వికలాంగులకు ర్యాంపులు, క్రీడా మైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు.

నాడు-నేడుతో మారిన రూపురేఖలు

రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు ఇప్పటికే నాడు-నేడు పథకం ద్వారా సమూలంగా మారిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు, డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపడతారు. పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు మొదటి విడత నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి.

విద్యార్థులు రాణించేందుకు అవకాశం

మా పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మరిన్ని సదుపాయాలతో పాఠశాల అభివృద్ధి చెందనుంది. దీంతో విద్యార్థులు చదువులో మరింతగా రాణించే అవకాశం ఉంది.

– బి.కామరాజు, హెచ్ఎం, సంతబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దశల వారీగా నిధులు విడుదల

ఎంపికైన పాఠశాలలకు దశలవారీగా నిధులు విడుదల చేస్తారు. పర్యవేక్షణ అంతా ఎంఈఓలదే. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ, ఆర్థిక, సాంకేతిక సహకారం, సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. పాఠశాల ఆవరణలోనే సేంద్రీయ విధానంలో కూరగాయల సాగు, అభ్యసన నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. బాలికా విద్యాభివృద్ధి, సైన్స్ ప్రాజెక్టులు వంటి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యం ఉంటుంది.

– జలుమూరు చిన్నవాడు, ఎంఈఓ, సంతబొమ్మాళి మండలం

విజయవంతం చేయండి

సోంపేట: కూటమి ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ హయాంలో శుక్రవారం చేపట్టనున్న ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ పిలుపునిచ్చారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి, విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఏడీకి వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ హయాంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదలైంది. ఉదయం 10 గంటలకు జీఎంఆర్ కాలనీ నుంచి విద్యుత్ ఏడీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, అధికారులకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టెక్కలి: నియోజకవర్గంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. టెక్కలి వైఎస్సార్ జంక్షన్ నుంచి ర్యాలీ చేపట్టి విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వరకు నిరసన కొనసాగించి, అనంతరం వినతిపత్రం అందజేయనున్నారు.

డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

- రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా నియామకాలు
- టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి, పక్కనే తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి

టెక్కలి: డివిజన్‌లోని 9 మండలాల పరిధిలో 59 చౌకధరల దుకాణాల డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆయా డిపోల రిజర్వేషన్ ప్రాతిపదికన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 9వ తేదీలోగా రూ.600ల డీడీతో సహా టెక్కలి ఆర్డీవో కార్యాలయానికి దరఖాస్తు అందజేయాలని సూచించారు. 10వ తేదీన దరఖాస్తులను పరిశీలించి, 17న హాల్ టికెట్లు జారీ చేస్తామన్నారు. 19న రాత పరీక్ష, 23న పరీక్ష ఫలితాలు, 27న ఇంటర్వ్యూలు నిర్వహించి 30న తుది ఫలితాలను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. రాత పరీక్షకు 80 మార్కులు, ఇంటర్వ్యూకు 20 మార్కులు కేటాయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. టెక్కలిలో 9, కోటబొమ్మాళిలో 20, సంతబొమ్మాళిలో 6, పాతపట్నంలో 8, మెళియాపుట్టిలో 2, హిరమండలంలో 1, కొత్తూరులో 7, సారవకోటలో 4, ఎల్.ఎన్.పేటలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అలాగే టెక్కలి జగతిమెట్ట జగనన్న కాలనీపై ఇటీవల వచ్చిన ఫిర్యాదుల మేరకు చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో 223 మంది తమ పట్టాలను చూపించలేదని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వెల్లడించారు. నిజమైన అర్హుల కోసం పట్టాల దర్యాప్తునకు మరో అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి ఉన్నారు.

గుర్తింపు కార్డులు వినియోగించుకోవాలి



గుర్తింపు కార్డులు అందిస్తున్న మత్స్యశాఖ అధికారి నాగరాజు

కాశీబుగ్గ: మత్స్యకారులు నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం (ఎన్ఎఫ్‌డీపీ) కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పలాస మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.నాగరాజు సూచించారు. పలాస మండలం పరిధి ఇన్లాండ్ ఫిషర్ మ్యాన్ సొసైటీలో ఉన్నటువంటి సుమారు 100 మందికి ఎన్ఎఫ్‌డీపీ కార్డులు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గుర్తింపు కార్డులు పొందినవారే అసలైన మత్స్యకారులుగా గుర్తింపు పొందుతారన్నారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ పలాసలో అందరం చెరువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నామని, ఐస్ బాక్సులు, 80 శాతం సబ్సిడీపై చేప పిల్లలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్లాండ్ ఫిషర్ మ్యాన్ సొసైటీ ప్రెసిడెంట్ ఉమాశంకర్ బెహరా, కార్యదర్శి భాస్కర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలి

కాశీబుగ్గ:



మున్సిపల్ కార్మికులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని జిల్లాలో నంబర్ వన్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన చెక్కుల పంపిణీ, పారిశుద్ధ్య కార్మికుల అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు, టబ్బులు, పాదరక్షలు, సబ్బులు, కొబ్బరినూనె బాటిల్స్‌తో కూడిన కిట్లు పంపిణీ చేశారు. అలాగే 80 మంది డ్వాక్రా సంఘం మహిళలకు రివాల్వింగ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీ ట్రేడ్ కార్పొరేట్ చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా బీసీఎల్ అధ్యక్షులు లొడగల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29న ప్రతిభా పరీక్ష

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పరీక్ష, విద్యా సదస్సు జరుగుతుందని వేదిక ప్రధాన కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి ఉన్నవారు 99637 08029 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు గెలిపొందినవారికి జ్ఞాపిక, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన తోట ఏసు(36) అనే వ్యక్తి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 24వ తేదీన మృతుడు ఏసు తన ఇంట్లో వచ్చిన చిన్నపాటి గొడవ కారణంగా మనస్థాపానికి గురై పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అయితే చికిత్స పొందుతూ ఏసు మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి పెద్దపీట



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రేమ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ నర్తు ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఈదుపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.11 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదుపురంను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండలో బెహరా, వైఎస్సార్‌సీపీ నాయకులు తొభిరో బెహరా, బొనమిళి బెహరా, జొయెమంగల్ బెహరా, హంగీర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కంచిలి: వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. పొలాల్లో నీరు నిలచిపోవడంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లలేక వరి పంటలు పూర్తిగా తడిసి, కుళ్లిపోయి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్‌లు కొణపల సురేష్, గణప సింహాచలం, నేతలు పలికల జయరాం, డొక్కరి బలరాం, పైల లక్ష్మీనారాయణలు ఉన్నారు.

28న మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ నడిపేన రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ




వజ్రపుకొత్తూరు మండలంలోని పాత టెక్కలి పంచాయతీలో గురువారం అమ్మ నాన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ తుంగాన సుశీల చేతుల మీదుగా 75 మందికి వీటిని పంపిణీ చేశామని ట్రస్ట్ చైర్మన్ గృహలక్ష్మీ తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మంజుల, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

లక్ష్మీదేవికి పూజలు



ఇచ్ఛాపురం పట్టణంలోని దేవాలయాల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం, జగన్నాథస్వామి ఆలయంలో మార్గశిర మాసం గురువారం పురస్కరించుకొని ఉదయం పాలు పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలు, అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. – ఇచ్ఛాపురం

ప్రత్యేక నిఘా



టెక్కలి పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పలు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా పెట్టినట్లు ఎస్ఐ రాము గురువారం తెలియజేశారు. టెక్కలి పరిధిలోని డమర, గూడేం, ఎఫ్‌సీఐ గోడౌన్స్, చేరివీధి జంక్షన్, ఎర్రన్నాయుడి పార్కు, ఆదిఆంధ్రవీధి, ఆర్టీసీ డిపో వెనుక భాగం, జగతిమెట్ట తదితర నిర్మానుష్య ప్రాంతాలపై డ్రోన్ నిఘా ఉంచామన్నారు. – టెక్కలి రూరల్

ప్రజలకు అండగా పోరాడుదాం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: రాష్ట్రంలో హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలకు అండగా పోరాడుదామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో ఓటమిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ వార్డు నుంచి సర్పంచ్‌లు, మండల స్థాయి నాయకులంతా పార్టీ బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.సత్యం, హెచ్.వెంకటేశ్వరరావు, టి.కిరణ్, కె.రవికుమార్‌గాంధీ, ఆర్.జయమోహన్, ఎ.రాహుల్, వి.శ్రీధర్‌రెడ్డి, ఎన్.సాబతో, డి.పోలయ్య, పి.రమణబాబు, బి.ఉదయ్, బి.తులసీరావు, జి.మోహన్‌రెడ్డి, కె.కృష్ణారావు, ఎం.గణపతిరావు, బి.కార్తీక్, ఎ.రవి, ఎన్.సోమేష్, కె.తిరుమల, డి.మదీన్, కె.చిన్నారావు, యు.తమ్మయ్య, డి.కూర్మారావు, టి.ఆదినారాయణ, వి.లక్ష్మీనారాయణ, రంగబాబు, పి.రాము, కె.జీవన్, హెచ్.లక్ష్మణ్, ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రామయ్యతో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని రాగుపురం గ్రామానికి చెందిన గేదెల రామయ్య ఇటీవల జరిగిన ప్రమాదంలో జారిపడడంతో తలకు గాయమై కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో శ్రీకాకుళం వద్ద రాగోలు గ్రామంలోని జెమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బాధితుడిని జెమ్స్ ఆస్పత్రికి గురువారం వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రోగితోపాటు, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు సర్పంచ్‌లు కొణపల సురేష్, గణప సింహాచలం, నేతలు పలికల జయరాం, డొక్కరి బలరాంలు ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు బారువ విద్యార్థులు



సోంపేట: అథ్లెటిక్స్‌లో పాల్గొన్న విద్యార్థులు



టెక్కలి: ఎంపికైన టెక్కలి కళాశాల విద్యార్థులు

సోంపేట: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు బారువ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డి.రామారావు గురువారం తెలిపారు. కళాశాలకు చెందిన పి.ప్రవంతి, బి.నితిన్‌లు భువనేశ్వర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే వి.తాతారావు తమిళనాడు తిరువనంతపురంలో జరగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొంటాడని వెల్లడించారు. దీంతో విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ కొణతల రామారావును కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

టెక్కలి: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం తెలిపారు. కళాశాలకు చెందిన దారపు డిల్లీ (లాంగ్ జంప్), టొంపల యోగేశ్వరరావు(100 మీటర్ల పరుగు పందెం), కొర్రాయి ధనుంజయ్ (400 మీటర్ల పరుగు పందెం) పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పీడీ బి.సత్యనారాయణతో పాటు సిబ్బంది అభినందించారు.